సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 11 । మార్చి । 2025



కమనీయం నరసన్న కల్యాణం

శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా కోరుకొండ గోవింద, హరి నామస్మరణతో మార్మోగింది.

8లో



డెల్టాకు 9,650 క్యూసెక్కులు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 9,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.50 నీటిమట్టం అడుగులకు చేరింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహర్ బుధవారం (ఉదయం)
రాజమండ్రి	6.20	4.53
కాకినాడ	6.20	4.53
అమలాపురం	6.20	4.53

న్యూస్‌రీల్

ముస్లిం మైనార్టీలపై చిన్న చూపెందుకు బాబూ?

ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ నిజాం



అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్సీ పదవి మైనారిటీలకు లేకుండా చేయడం ద్వారా ఆ వర్గానికి అన్యాయం చేశారని ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ నిజాం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలను సీఎం చంద్రబాబు చిన్నచూపు చూస్తున్నారని, నామినేటెడ్ పోస్టుల్లోనూ ముస్లింలకు ప్రాధాన్యం దక్క లేదని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ముస్లిం, దూదేకులకు 13 కార్పొరేషన్ చైర్మన్ పదవులిచ్చి వాటిలో 6 కేబినెట్ హోదా కల్పించారని గుర్తుచేశారు. శాసనమండలిలో వైస్ చైర్మన్ పదవితోపాటు రాష్ట్రంలో టాప్ 10 కార్పొరేషన్లలో ఇద్దరు ముస్లింలకు చోటు కల్పించారన్నారు. జనసేన దక్కించుకున్న కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో ఒక్కటి కూడా ముస్లిం మైనారిటీలకు కేటాయించకపోవడం గమనిస్తే మైనార్టీలపై పవన్ కల్యాణ్ వైఖరి అర్థమవుతోందన్నారు. ఆయనకు మైనారిటీల అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని ఆయన అన్నారు. జనసేన, టీడీపీలో ఉన్న మైనారిటీ నాయకులు సీఎం చంద్రబాబునాయుడితో మాట్లాడి.. బీజేపీ ప్రభుత్వం తీసుకోరాబోతున్న కుట్రపూరిత వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసే విధంగా ఒత్తిడి తీసుకొని రావాలని ఆయన కోరారు.

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయం ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం వేలాదిగా వచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంతి మండపాలు అన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించగా స్వామివారి వ్రతాలు 1,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ. 30 లక్షలు ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో నాలుగు వేల మందికి భోజన సౌకర్యం కల్పించారు. సత్యదేవునికి ఘనంగా ఏకాదశి పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు స్వర్ణ పుష్పార్చన, ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు పుష్పార్చన నిర్వహించారు. ముత్యాల కవచాల అలంకరణలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ రోజు స్వర్ణాభరణాలు, వజ్ర కిరీటాలతో భక్తులకు దర్శనమిచ్చే స్వామి, అమ్మవారు ప్రతీ సోమవారం ముత్యాల కవచాలతోను, ప్రతీ గురువారం ఏ విధమైన ఆలంకరణలు లేకుండా నిజరూపంలో దర్శనమిస్తున్న విషయం తెలిసిందే.

పర్యావరణం, ఉపాధి సంగతేమిటి?

అమలాపురం టౌన్: శాసన సభ సమావేశాల సాక్షిగా మంత్రి నారాయణ వరల్డ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఏసియా, హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు రూ.48 వేల కోట్ల (అప్పు)తో రానున్న ఐదారు నెలల్లో అభివృద్ధి చేయనున్నామని చెప్పారు సరే.. మరి పర్యావరణం, ఉపాధి అవకాశాలను ఎందుకు ప్రస్తావించలేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సూటిగా ప్రశ్నించారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడారు. ఎక్కడైనా అభివృద్ధి పేరిట పనులు మొదలెడితే, ఆ ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటుంది, కూలీలకు ఉపాధి అవకాశాలు మృగ్యమవుతాయి, ఇలాంటి అభివృద్ధి పేరిట ఉత్పన్నమయ్యే సమస్యలపై యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్(యూఎన్‌వో) ద్వారా ఇంటర్నేషనల్ కోర్టు ఆఫ్ లాలో ఎన్నో దేశాల్లో కేసులున్నాయని ఎమ్మెల్సీ గుర్తుచేశారు. అమరావతి అభివృద్ధి పేరుతో భవిష్యత్తులో జరగనున్న పర్యావరణ, ఉపాధి అవకాశాలపై ఎదురయ్యే సమస్యలను ఛాలెంజ్ చేస్తూ వైఎస్సార్ సీపీ అనుమతితో ఇంటర్నేషనల్ కోర్టు ఆఫ్ లాలో కేసు వేస్తామని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. యూఎన్‌వో చార్టర్ ప్రకారం రిహాబిలిటేషన్, రీ షెటిల్‌మెంట్ పరంగా అమరావతి అభివృద్ధి పేరిట కూలీలు, రైతులు, కార్మికులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు.

చక్కటి సేవ.. పక్కా దోవ



- బృహత్తర గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కుట్ర
- అసలు విధులు పక్కనబెట్టి .. సర్వేలకే పరిమితం
- జాబ్‌చార్ట్‌కు విరుద్ధంగా పనులు
- హేతుబద్ధీకరణ.. పని ఒత్తిడితో ఉద్యోగుల సతమతం
- గత ప్రభుత్వ హయాంలో 500కు పైగా పౌర సేవలు

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు గుమ్మం వద్దకే అందించేందుకు తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కుట్ర పన్నింది. రోజుకో నిర్ణయం తీసుకొంటూ దేశంలో ఎక్కడాలేని చక్కటి విధానాన్ని నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుంది. ఇప్పటికే గ్రామ, వార్డు వలంటీర్లను సాగనంపిన సర్కారు తాజాగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై వేధింపుల పర్వానికి తెర తీసింది. నిర్దేశించిన విధులు కాకుండా అన్ని పనులు సచివాలయ ఉద్యోగులతో చేయిస్తూ మానసిక క్షోభకు గురిచేస్తోంది. బయటకు చెప్పుకోలేక.. ప్రభుత్వాన్ని ప్రశ్నించలేక ఉద్యోగులు లోలోపల మదనపడుతున్నారు. జాబ్‌చార్ట్‌లో లేని పనులు చేయిస్తూ ఒత్తిడికి గురిచేస్తున్న సర్కారు.. ఉద్యోగుల కుదింపునకు శ్రీకారం చుట్టింది. వివిధ రకాల సర్వేల పేరుతో ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తోంది. సెలవు రోజుల్లో సైతం శిక్షణ పేరుతో తిప్పలు పెడుతోంది. ఈ పరిణామం ప్రజలకు సకాలంలో సేవలు అందించలేని పరిస్థితికి దారితీసింది. ఫలితంగా తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిల్లా కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల వద్దకు పరుగులు పెడుతున్నారు.



ప్రభుత్వ నిర్ణయాలకు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు (ఫైల్)

36 రకాల సర్వేలు

గ్రామ, వార్డు వలంటీర్లు చేపట్టే పనులన్నీ సచివాలయ ఉద్యోగులతో చేయించేస్తున్నారు. ప్రతి నెలా ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్నామని గొప్పలు చెప్పుకునేందుకు సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. జాబ్‌చార్ట్‌కు విరుద్ధంగా పనులు చేయిస్తున్నారు. 36 రకాల సర్వేలకు సచివాలయ ఉద్యోగులను వినియోగిస్తున్నారు. ప్రతి నెలా ఉదయం ప్రతి ఇంటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేపట్టాల్సి వస్తోంది. ఇది మంచిదే అయినా మిగిలిన వాటిపై ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఓడీఎఫ్ సర్వేలో భాగంగా మురుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతలు సైతం సచివాలయ ఉద్యోగులకే అప్పగించారు. ఆర్‌డబ్ల్యూఎస్ పల్స్ సర్వేలో కుళాయిలు ఫొటోలు సైతం తీస్తున్నారు. ఉదయం 6 గంటలకు పారిశుద్ధ్యం తీరును పరిశీలించాల్సి ఉంది. 100 రోజుల హౌస్‌హోల్డ్ సర్వే, ఇంటింటికీ స్టిక్కర్లు అతికించి కరపత్రాలు పంపిణీ చేసే విధులు చేపడుతున్నారు. విజన్ 2047 పేరుతో సర్వే నిర్వహిస్తున్నారు. హౌస్ టు హౌస్ జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఎంఎస్ఎంఈ సర్వే, ప్రజా ఫిర్యాదులపై వెరిఫికేషన్(పీఆర్ఎస్) సర్వే, ఎన్‌పీసీఐ లింక్(బ్యాంక్ లింక్) వంటి కార్యక్రమాలన్నీ సచివాలయ ఉద్యోగులే చేపడుతున్నారు. వార్డు పరిపాలన కార్యదర్శులకు ఒకవైపు హౌస్ జియో ట్యాగింగ్, మరోవైపు ప్రాపర్టీ ట్యాక్స్ వసూళ్ల చేయాలని లక్ష్యాలు నిర్దేశిస్తున్నారు. ఈ-వసూళ్లను పెంచాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. వెల్ఫేర్ సెక్రటరీలకు ఎన్‌పీసీఐ(బ్యాంక్ అకౌంట్‌కి ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ) విధులు కేటాయిస్తున్నారు. అనుకున్న సమయంలో పూర్తవకపోతే మెమోలు జారీ చేస్తున్నారు.

అసలు సేవలకు ఆటంకం

సచివాలయ ఉద్యోగులను కేవలం సర్వేలకు వినియోగిస్తుండటంతో పౌర సేవలు సక్రమంగా అందడం లేదు. చివరకు మహిళా పోలీసును సైతం సర్వేలకు తిప్పుతుండటంతో పల్లెల్లో శాంతిభద్రతలు, నాటుసారా తయారీ, విక్రయాలు పెట్రేగిపోయాయి. సచివాలయంలో కీలకంగా పనిచేయాల్సిన డిజిటల్ అసిస్టెంట్లు సైతం సర్వేల్లో భాగస్వామ్యం అవుతుండటంతో ప్రజా సేవలు అందడం లేదు. ప్రజలు కార్యాలయాల వద్దకు రావడం .. వెనుదిరిగి వెళ్లడం పరిపాటిగా మారుతోంది. అగ్రికల్చర్ అసిస్టెంట్లు పొలంబడి వదిలేసి గ్రామాల బాట పట్టారు.

టార్గెట్లు... వేధింపులు

విధుల్లో టార్గెట్లు ఇస్తున్నారు. అవి పూర్తి చేయకపోతే ఒత్తిడికి గురి చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రోగ్రెస్ పేరుతో వేధింపులకు పాల్పడుతున్నట్లు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. హౌసింగ్ రీ వెరిఫికేషన్ ప్రక్రియను సచివాలయ ఉద్యోగులకు కేటాయించారు. ఎడ్యుకేషన్ అండ్ డెటా ప్రాసెసింగ్ కార్యదర్శికి పౌరులకు డిజిటల్ సేవలు, పాఠశాలల్లో మురుగుదొడ్ల ఫొటోలు తీసే పని అప్పగించారు. అదనంగా జియో ట్యాగింగ్ పనులు సైతం కేటాయించారు. వీటితోపాటు శాఖపరమైన విధులు తప్పనిసరి చేయడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో...

గత ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలకు అన్ని రకాల సేవలు అందేవి. 35 శాఖలకు సంబంధించిన 500 రకాల సేవలు ప్రజలకు అందేవి. ప్రధానంగా పింఛన్, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు, సివిల్ పనులు, వైద్యం, ఆరోగ్యం, రెవెన్యూ సమస్యలు, భూముల సర్వే, శిశు సంక్షేమం, డెయిరీ, పౌల్ట్రీ లాంటి సేవలు సచివాలయంలోనే అందేవి. ప్రస్తుతం ఆయా శాఖల కార్యాలయాల వద్దకు పరుగులు తీయాల్సి వస్తోంది. గతంలో అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్య పరిష్కారం అయ్యేది. ప్రస్తుతం కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో నిర్వహించే గ్రీవెన్స్‌కు పరుగులు తీయాల్సి వస్తోంది.

ఉద్యోగుల కుదింపునకు కుట్ర

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 512 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 119 వార్డు సచివాయాలు, 393 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 5,513 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా.. 4,323 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. 1,190 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటి వరకు ఒక్కో సచివాలయంలో 10 నుంచి 11 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారి సంఖ్య తగ్గనుంది. 2,500 కంటే జనాభా తక్కువగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో 6 గురు, 2,500–3,500 మధ్య జనాభా ఉండే సచివాలయాల్లో 7 గురు, 3,500 పైబడి జనాభా ఉండే సచివాలయాల్లో 8 మంది చొప్పున మాత్రమే ఉద్యోగులను కొనసాగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఒక్కో సచివాలయం నుంచి ఇద్దరి నుంచి ముగ్గురు ఉద్యోగాలకు ఎసరు పెట్టింది. సగటును ఒక్కో సచివాలయంలో 8 మంది ఉద్యోగులను లెక్కగట్టినా.. 1,417 మంది ఉద్యోగులకు స్థాన చలనం కలగనుంది.

పోలీస్ పీజీఆర్‌ఎస్‌కు 29 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలను వింటున్న అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రతీ సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం'(పీజీఆర్ఎస్)కు 29 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి పోలీసు కార్యాలయానికి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా జిల్లా అడినల్ ఎస్పీ(అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ అడిగి తెలుసుకున్నారు. సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ఫిర్యాదిదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసిందిగా సూచించారు.

ఉప్పునీటి సమస్యపై రాజ్యసభలో ప్రస్తావన

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాజ్యసభలో వైఎస్సార్ సీపీ ఎంపీలు కేంద్రాన్ని పలు ప్రశ్నలు అడగ్గా.. కేంద్ర మంత్రులు రాతపూర్వకంగా సమాధానాలు ఇచ్చారు. సముద్ర తీరప్రాంతంలోని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉప్పునీటి సమస్యను ఎదుర్కొంటున్నట్లు కేంద్ర జల్‌శక్తి సహాయ మంత్రి రాజ్ భూషణ్‌చౌదరి తెలిపారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర తీర ప్రాంతాల్లో ఉప్పు చేరడం వలన అక్కడ పర్యావరణం దెబ్బతింతోందని, ఏయే ప్రాంతాలు ఉప్పు సమస్యను ఎదుర్కొంటున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వాని ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. 2012–23 వరకు జాతీయ జలాశయ మ్యాపింగ్ అధ్యయనాల్లో ఏపీలో భూగర్భ జలాలపై అధ్యయనం చేసినట్లు తెలిపారు.

అర్జీల పరిష్కారంలో హేతుబద్ధత



పీజీఆర్‌ఎస్‌లో వీల్‌చైర్‌ను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: ప్రజల నుంచి స్వీకరించిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్‌ఎస్ సమావేశ మందిరంలో ఆమె, జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడుతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల నియమావళి పూర్తయినందున వివిధ స్థాయిల్లో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను హేతుబద్ధతతో పరిష్కారం చూపాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని పరిష్కరించాలన్నారు. స్వయంగా కలిసిన వివరాలు ఎప్పటికప్పుడు పోర్టల్ లో అప్లోడ్ చేయాలన్నారు. ఆన్లైన్ లో ఉన్నతాధికారుల ద్వారా వచ్చిన 285 అర్జీలు పరిష్కారం చెయ్యాల్సి ఉందన్నారు. పోలీస్ 61, విద్యుత్ 31, రెవెన్యూ 65, పంచాయతీరాజ్ 28, వ్యవసాయ శాఖకు సంబంధించి 6 ఉన్నాయన్నారు. క్షేత్ర స్థాయిలో పరిష్కారం అయ్యే అర్జీలు జిల్లా కేంద్రానికి రావడం, ఒకే ఫిర్యాదు పలుసార్లు రావడం గుర్తించామన్నారు. భూములు, సర్వే, విభజన, మ్యుటేషన్, వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్ల కోసం, రేషన్ కార్డులు తదితర అంశాలపై అర్జీలు వస్తున్నాయని, సచివాలయం స్థాయిలో వివరాలు నమోదు చేసి అర్జీదారునికి వివరించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి వారికి తెలియజేయ్యాల్సి ఉంటుందన్నారు.

దివ్యాంగులకు 3 వీల్ చైర్స్, 10 హియరింగ్ ఎయిడ్స్ పంపిణీ

పీజీఆర్‌ఎస్‌లో జిల్లా ప్రత్యేక అవసరాల, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు వీల్ చైర్స్, 10 వినికిడి యంత్ర పరికరాలను కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్న రాముడు అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, బీఎస్పీ భవ్యకిషోర్, సీపీవో అప్పలకొండ, డీఎల్‌డీవో పి.వీణాదేవి పాల్గొన్నారు.

హిందువులపై అక్రమ కేసులు దారుణం

- వాటిని వెంటనే ఉపసంహరించాలి
- రాయచోటిలో ఉత్సవంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: అన్నమయ్య జిల్లా రాయచోటి సంఘటనలో స్థానిక ఎస్సైని సస్పెన్షన్ చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఆయన సక్రమంగా విధులు నిర్వర్తించకపోవడం దారుణమని పేర్కొంది. బాధిత హిందువులు, హిందూ సంస్థలపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని, ఉత్సవంపై దాడి చేసిన వారిని గుర్తించి, తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి తెలియజేస్తూ రాసిన వినతి పత్రాన్ని సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతికి అందజేసింది. ముందుగా విశ్వ హిందూ పరిషత్ సభ్యులు కోటిపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి బైక్ ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. రాధామనోహర్‌దాస్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు సత్తి గోవిందరెడ్డి, కార్యవర్గ సభ్యులు గనిరాజు, అనంత్, గీత, వెంకట్ , ప్రదీప్, వర్మ, కొవ్వూరు జిల్లా కార్యదర్శి గంగాధరం, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ విభాగ్ సహకార్యవాహ కామవరపు మోహన్‌కృష్ణ, విభాగ్ కార్యకారిణి సభ్యులు వాడ్రేవు మాణిక్యాలరావు, సమరతసేవ ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ కర్రి శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర తదితర సుమారు 300 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఉత్సవంలో దాడి

వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ రాయచోటిలో ఈ నెల 4వ తేదీన వీరభద్రస్వామి ఆలయ పార్వేటి ఉత్సవం సందర్భంగా భక్తులు ఊరేగింపు చేస్తుండగా హిందువులపై మరోవర్గం వారు దాడి చేశారని, ఈ దాడిని అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారన్నారు. అలాగే పక్షపాత ధోరణితో హిందువులపైనే అమానుషంగా లాఠీచార్జి చేసి వారిని తీవ్రంగా గాయపరిచి, అక్రమ కేసులు బనాయించారన్నారు. అన్ని అనుమతులు తీసుకొని ఉత్సవాన్ని నిర్వహించుకుంటుంటే, దానికి ఆటంకాలు కలగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఉత్సవంపై దాడి చేసిన వారిని వదిలేసి, తిరిగి హిందువులపై, హిందూ సంస్థలపై కేసు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.

అలరించిన నర్తనం



కూచిపూడి నృత్య ప్రదర్శనలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బెంగళూర్‌కు చెందిన ప్రముఖ కూచిపూడి కళాకారుడు పసుమర్తి కుమార దత్త బృందం ప్రదర్శించిన కూచిపూడి నర్తనం కళాభిమానులను అలరించింది. టి నగర్‌లోని శ్రీ త్యాగరాజ నారాయణ దాస సమితి 74 వ సంగీత వార్షికోత్సవాలలో భాగంగా సోమవారం సమితి ఆడిటోరియంలో కూచిపూడి నాట్య ప్రదర్శన పద్మ విభూషణ్, దివంగత మంగళంపల్లి బాల మురళీకృష్ణ రచించిన వినాయక కీర్తనతో ప్రారంభం అయింది. సదాశివ బ్రహ్మేంద్ర స్వామి విరచిత మానస సంచర రే కీర్తనతో పాటు రామదాసు, నారాయణ తీర్థులు, అన్నమయ్య తదితర ప్రముఖ వాగ్గేయ కారుల కీర్తనలకు కళాకారులు జీవం పోస్తూ ప్రదర్శన నిర్వహించారు. కళాకారులు పసుమర్తి కుమార దత్త, కావ్య, దేవిక, దీక్షిత ప్రదర్శనలను రక్తి కట్టించారు. ప్రముఖ నాట్య కళాకారుడు డాక్టర్ పసుమర్తి శ్రీనివాస శర్మ నట్టువాంగం, శాంతి, మల్లాది నరసింహారావులు గాత్రం, రవికిరణ్ వీణా సహకారాలను అందించారు. సమితి కార్యవర్గ సభ్యులు కళాకారులను ఘనంగా సత్కరించారు. పెద్ద సంఖ్యలో కళాభిమానులు హాజరయ్యారు.

చంద్రబాబు మోసకారి

యువత పోరు పోస్టర్ ఆవిష్కరించిన చెల్లుబోయిన, తలారి, జక్కంపూడి



యువత పోరు పోస్టర్ ఆవిష్కరించిన వేణు, తలారి, జక్కంపూడి తదితరులు

తాళ్లపూడి: మాట నిలబెట్టకోలేని మోసకారి చంద్రబాబు అయితే ఇచ్చిన మాట నూటికి నూరు పాళ్ల నిలబెట్టుకునే నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ తలారి వెంకట్రావు అన్నారు. తాళ్లపూడి మండలం లోని తాడిపూడిలో సోమవారం తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, కొవ్వూరు నియోజక వర్గ కో ఆర్డినేటర్ తలారి వెంకట్రావు , రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఇతర నాయకుల చేతుల మీదుగా 12న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించే యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ యువతలో చైతన్యం లేకపోతే ప్రభుత్వాల్లో జవాబుదారీ తనం ఉండదన్నారు. అందుకే యువత పోరు 12న కలెక్టరేట్‌ల వద్ద నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాజకీయ నాయకులు జవాబుదారీతనంతో ఉండాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి యువత కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశారని అన్నారు. విద్య మాత్రమే పేదరికాన్ని జయించేలా చేస్తుందని నమ్మిన నాయకుడు జగన్ అని అన్నారు. జగన్ తల్లుల ఖాతాల్లో నేరుగా ఫీజులు చెల్లించేవారన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు అబద్దం ఎన్నికల తరువాత కూడా అబద్ధం ఆడుతున్నారని అన్నారు. జగన్ చేసిన అప్పుల విషయంలో రూ.14 లక్షల కోట్లు అని, రాష్ట్రం శ్రీలంక అవుతుందని అసత్య ప్రచారం చేశారని నేడు అసెంబ్లీ సాక్షిగా రూ.6,46,000 కోట్ల అప్పు అని తేలిందన్నారు. కేవలం చంద్రబాబు ఏడాదిలోనే రూ.1.35 వేల కోట్లు అప్పులు చేశారని వాటి ఒక్క పైసా కూడా సంక్షేమానికి కేటాయించలేదన్నారు. మోసకారి జవాబుదారి తనం లేని నాయకుడు చంద్రబాబు అని, నిజం మాత్రమే చెప్పే నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. యువత పోరుకు యువత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తరలిరావాలన్నారు. రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్‌లో భాగంగా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదని కనీసం బడ్జెట్లో కేటాయింపులు లేవని అన్నారు. అందుకే యువత, నిరుద్యోగుల తరపున పోరాటం చేస్తున్నట్టు తెలిపారు. జగన్ ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకువచ్చి నిర్మాణాలు, ప్రారంభిస్తే వాటిని ప్రస్తుత ప్రభుత్వం కుట్రపూరితంగా నిలుపుదల చేసి ప్రయివేట్ పరం చేసే కుట్ర చేస్తోందని అన్నారు. తలారి వెంకట్రావు మట్లాడుతూ కూటమి ప్రభుత్వం 10 నెలల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. విద్యార్థులు ఫీజుల కోసం ఎదరుచూస్తున్నారని అన్నారు. విద్యార్థులు, నిగుద్యోగుల కోసం యువత పోరు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆరోజు ఉదయం జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో కూడా పాల్గొనాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, తాడిపూడి సర్పంచ్ నామా శ్రీనివాస్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గూడా విజయరాజు, పోలవరం ఎంపీపీ సుంకర వెంకట రెడ్డి, , నాయకులు పోశిన శ్రీకృష్ణదేవరాయులు, యాళ్ల బాబురావు, గండి రాంబాబు, నామా ప్రకాశం, సుంకర సత్యనారాయణ, మండిగ గిరి, తిగిరిపల్లి వెంకట్రావు, వి నంద, సుంకర సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,000
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

మిత్రుల అంకురం.. రైతులకు సంబరం

- పంటకు రక్షకులు.. కీటకాలకు శత్రువులు
- రసాయనాల వినియోగంతో కనుమరుగు
- ప్రకృతి వ్యవసాయంతో మిత్ర పురుగులకు జీవం
- సేంద్రియ పంటల్లో వాటి ప్రాముఖ్యమెంతో..

పిఠాపురం: పంటకు మేలు చేసి, రైతులకు పురుగు మందుల ఖర్చు తగ్గించే మిత్రులుగా భావించే మిత్ర పురుగులు సేంద్రియ వ్యవసాయం పుణ్యమా అని మళ్లీ వాటికి జవజీవాలు సంతరించుకున్నాయి. విచ్చలవిడిగా రసాయనాల వినియోగంతో కనుమరుగైన మిత్ర పురుగులు.. సేంద్రియ వ్యవసాయంతో ఉనికిలోకి వస్తున్నాయి. వీటివల్ల పంటలకు ఎంతో మేలు కలిగి, రైతుకు పైసా ఖర్చు లేకుండానే క్రిమికీటకాలు నివారించబడతాయి. అలాంటి మిత్ర పురుగులు పొలాల్లో కనిపించకుండా పోవడంతో, కీటకాలు పెరిగి, పంటలకు తెగుళ్లు సోకి రైతుకు నష్టాలను మిగులుస్తున్నాయి. ఈ తరుణంలో ప్రకృతి వ్యవసాయం వల్ల పంటలకు మిత్రులు మళ్లీ వస్తుండడంతో రైతులను ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పంటలకు మేలు

సాలీడు, అక్షింతల పురుగు, తూనీగలు, అల్లిక రెక్కల పురుగు, గొల్లభామలను పంటలకు మిత్రులుగా చెబుతారు. ఇవి పంటలకు రక్షణ కవచాలుగా రైతులు పరిగణిస్తుంటారు. కొన్నేళ్లుగా సాగులో రసాయనాలను గణనీయంగా వినియోగించడంతో కనుమరుగైన ఈ పురుగులు.. ప్రకృతి వ్యవసాయం వల్ల, రసాయనాల వినియోగం తగ్గి, మళ్లీ భూమిపై సంచరిస్తూ పంటలకు మేలు చేస్తున్నాయి. ఈ మిత్ర పురుగులు పొలంలో లేకుంటే పంటకు కీడు చేసే పురుగుల తీవ్రత పెరిగి, పంటలకు తీవ్ర నష్టాలను కలిగిస్తాయి.

అక్షింతల పురుగు



పంటలకు అక్షింతల పురుగు (లేడీ బర్డ్ బీటిల్) చాలా ప్రయోజనకరంగా చెబుతారు. అనేక రకాల కీటకాలను, పేను బంక లాంటి రసం పీల్చే పురుగులకు ఇవి సహజ శత్రువులు. ఒక అక్షింతల పురుగు తన జీవిత కాలంలో సుమారు ఐదు వేల పేనుబంక పురుగులను తింటుంది. గుండ్రంగా కుంభాకారం కలిగి ఉంటుంది. పసుపు, గులాబీ, నారింజ, ఎరుపు, నలుపు రంగుల్లో మచ్చలు కలిగి ఉంటుంది. వీటి లార్వాలు సైతం కీటకాలను వేటాడుతాయి. ఆడ పురుగులు ప్రతి మూడు నెలలకోసారి సుమారు వెయ్యి గుడ్లు పెడతాయి. ఇవి ప్రకాశవంతమైన మచ్చలతో, నలుపు రంగులో ఉండి, ప్రమాదకరమైన దానిగా కనిపించినప్పటికీ పంటకు మాత్రం ఎంతో మేలు చేస్తుంది. ఇవి వదిలే లార్వా ఎటువంటి ప్రమాదకరం కాకపోవడంతో పంటకు మేలు మినహా, కీడు అనేది ఉండదు. అనేక వారాల పాటు పంటలపై ఉండి కీటకాలను తినడం ద్వారా రైతులు కీటకాల నివారణకు పురుగు మందులు పిచికారీ చేసే అవసరం లేకుండా, పెట్టుబడి, శ్రమ చాలా తగ్గుతుంది.

అల్లిక రెక్కల పురుగు



ప్రకృతిలో అల్లిక రెక్కల పురుగు (గ్రీన్ లేస్ వింగ్ బగ్) విరివిగా కనిపించే ఓ సాధారణ రెక్కల పురుగు. కానీ ఇది పంటలకు చేసే మేలు అంతా ఇంతా కాదు. గొంగళి పురుగులు, లీఫ్ ఆఫర్స్, బిలివర్స్, వైట్ ఫ్లెస్ట్ వంటి ఇతర మృదువైన శరీరం కలిగిన కీటకాలను నియంత్రించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి. లేత ఆకుపచ్చ రంగులో, సున్నితమైన రెక్కలతో ఉండే ఈ పురుగు వదిలే లార్వా ఇతర కీటకాలను నాశనం చేస్తాయి. పంటలు నాశనం చేసే కీటకాలకు దీనిని బద్ధ శత్రువుగా చెబుతారు.

తూనీగ



పొడవైన శరీరం కలిగి, కళ్లు, రెండు జతల బలమైన రెక్కలు కలిగి, వివిధ రంగుల మచ్చలతో ఉండే తూనీగ (డ్రాగన్ ఫ్లై) 95 శాతం కీటకాలను వేటాడతాయి. అందుకే దీనిని డెడ్లీ హంటర్ అని కూడా అంటారు. కచ్చితమైన లక్ష్యాన్ని ఛేదించేవిగా చెబుతారు. ఇవి ఒకే వేసవిలో వేలాది కీటకాలను పట్టుకుని తింటాయి. దోమలు, ఈగలు, తెల్లదోమలను తిని పంటలకు మేలు చేకూరుస్తాయి.

సాలీడు



సాధారణ పంటలకు సోకే తెగుళ్ల నియంత్రణకు సాలీడు (స్పైడర్) జీవ ఏజెంట్లుగా పని చేస్తాయి. ఇవి అనేక సజీవ కీటకాలను తింటాయి. చీడపీడలను నియంత్రించడంలో వీటిని మించిన పురుగు మరొకటి లేదంటారు. కేవలం శత్రు కీటకాలను తినడం మినహా, పంటకు కానీ, మొక్కలకు కానీ ఎటువంటి హానీ చేయకపోవడం వల్ల మిత్ర పురుగుల్లో ఇది తొలి స్థానంలో ఉంది. దోమలు, ఈగలు, తెల్లదోమలు, ఎగిరే కీటకాలను పట్టుకుని తినడం ద్వారా ఇవి పంటలకు మేలు చేస్తాయి.

గొల్లభామ



పంటలకు గొల్లభామ (ప్రేయింగ్ మ్యాంటీస్)లను ఆస్తులుగా చెబుతారు. తెగుళ్ల నియంత్రణలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. పునుబంక, ఆస్తరాగస్ బీటిల్స్, గొంగళి పురుగు, బీటిల్స్, తేనెమంచు పురుగు తదితర వాటిని తిని పంటలకు హాని కలగకుండా నివారిస్తాయి. ఇవి పుప్పొడి మకరందాన్ని తీసుకోవు. కానీ వీటిని ఉత్పత్తి చేసే మొక్కలు గొల్లభామలు తినే ఆహారాలైన కీటకాలను ఆకర్షిస్తాయి. వీటివల్ల పంటలకు చాలా మేలు కలుగుతుంది.

మిత్ర పురుగులు మళ్లీ వచ్చాయి



గతంలో ఎక్కడ చూసినా మిత్ర పురుగులు కనిపించేవి. కానీ రసాయనాల వినియోగం వల్ల అవి కనుమరుగయ్యాయి. ముఖ్యంగా పొలాల్లో అస్సలు కనిపించడం లేదు. కానీ సేంద్రియ వ్యవసాయం మొదలయ్యాక వాటి మనుగడ మళ్లీ ప్రారంభమైంది. రైతు ఎటువంటి పురుగు మందులు వాడకుండా, 70 శాతం వరకు ఇవి పంటలకు హాని చేసే కీటకాలను నాశనం చేసి, పంటకు మేలు చేస్తాయి. ఇప్పుడు ఇవి భారీగా కనిపిస్తున్నాయి. తెగుళ్ల తగ్గుముఖం పట్టాయి. రైతుకు పెట్టుబడి తగ్గింది. ఇది చాలా శుభపరిణామంగా చెప్పవచ్చు.

– గుండ్ర శివచక్రం, ప్రకృతి వ్యవసాయ రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

ప్రకృతి వ్యవసాయ ఫలితమే..



కొన్నేళ్లుగా చేపట్టిన ప్రకృతి వ్యవసాయ సాగు ఫలితమే మిత్ర పురుగుల మనుగడకు అంకురం. ప్రస్తుతం సేంద్రియ పంటలన్నింటి పైనా ఈ పురుగులు సంచరిస్తున్నాయి. తద్వారా కీటకాల బెడద గణనీయంగా తగ్గింది. పురుగు మందుల అవసరం లేకుండా పోయింది. పంటలకు మంచి రోజులు వచ్చాయనడానికి నిదర్శనమే మిత్ర పురుగుల సంచారం. ఇది మారుతున్న వ్యవసాయ విధానాల్లో శుభపరిణామంగా చెప్పవచ్చు.

– ఎలియాజరు, డీపీఎం, ప్రకృతి వ్యవసాయ శాఖ, కాకినాడ

ఆకట్టుకున్న సూక్ష్మ బంగారు వరల్డ్ కప్



శిల్పి సాయి తయారు చేసిన వరల్డ్ కప్



తాళాబత్తుల సాయి

పెద్దాపురం: ఐసీసీ ఛాంపియన్‌షిప్‌లో టీమిండియా మూడోసారి విజేతగా నిలిచిన సందర్భంగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ అవార్డు గ్రహీత, పట్టణంలోని బంగారు శిల్పి తాళాబత్తుల సాయి సూక్ష్మ బంగారు వరల్డ్ కప్‌ను రూపొందించారు. కేవలం 40 నిమిషాల సమయంలో 0.100 మిల్లీ గ్రాముల బంగారంతో 10 మిల్లీమీటర్ల పొడవు కలిగిన వరల్డ్ కప్‌ను తయారు చేసి, పలువురి మన్ననలు అందుకున్నారు.

కమనీయం నరసన్న కల్యాణం

- శ్రీలక్ష్మీ నరసింహుని రథోత్సవం భక్తజన సందోహం
- కన్నుల పండువగా కల్యాణోత్సవాలు

మధురపూడి: శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా కోరుకొండ గోవింద, హరి నామస్మరణతో మార్మోగింది. స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి 9 గంటలకు కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగాయి. దేవస్థానంలోని కల్యాణ మండపంలో స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. కోరుకొండ నవనరసింహ క్షేత్రం కావడంతో సుదూర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోరుకొండ పరిసరాలన్నీ భక్తజనంతో కిక్కిరిసింది. రథోత్సవంతో కోరుకొండ మీదుగా గోకవరం, భద్రాచలం, విశాఖపట్నం, విజయనగరం వెళ్లాల్సిన వాహనాలు నిలిచిపోయాయి. ప్రధాన వీధుల మీదుగా కొనసాగిన రథోత్సవం సాయంత్రం 5.30కు తిరిగి దేవస్థానానికి చేరింది. అక్కడ స్వామి, అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఆలయానికి తోడ్కొనివచ్చారు. వధూవరులకు మంగళస్నానాలు నిర్వహించారు. పట్టు వస్త్రాలను అలంకరించిన స్వామి, అమ్మవారు దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. వధూవరులకు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం వేద పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు కల్యాణం నిర్వహించారు. దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త ఎస్‌పీ రంగరాజభట్టర్, అర్చక స్వాములు పెద్దింటి, పెదపాటి వారి పర్యవేక్షణలో కల్యాణ వేడుక కమనీయంగా జరిగింది.



కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

మాలధారణ భక్తుల ప్రదర్శనలు

రథోత్సవంలో మాలధారణ చేసిన భక్తుల ప్రదర్శనలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 220 మంది భక్తులు స్వామివారి మాలధారణ వేశారు. ఉత్సవాల సందర్భంగా స్వాములు 9 రోజుల పాటు నిష్ఠతో పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. వీరికి స్వామివారి మాలధారణ ట్రస్టు ద్వారా వడి, భిక్షలను ఏర్పాటు చేశారు. బుధవారం దీక్షను విరమిస్తారు.

భక్తజన సందోహం నడుమ..

సోమవారం స్వామివారి రథోత్సవం భక్తజన సందోహం నడుమ వైభవంగా జరిగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 1.56 గంటలకు వేద మంత్రోచ్ఛరణతో స్వామి, అమ్మవార్లు ఆశీనులైన రథం బయలుదేరింది. కొండ నుంచి ప్రారంభమైన రథం దేవస్థానం రోడ్డు, వాటర్ ప్లాంట్, రెడ్డి పంతులు సత్రం, పాత సంత మార్కెట్, వడ్డీలపేట, మత్స్యకారుల వాడ, ఎయిర్‌టెల్ టవర్, సాయిబాబా గుడి, అంకాలమ్మ గుడి, శివాలయం మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, బ్యాండ్‌మేళాలు, కోలాటం, తీన్మార్, శక్తి వేషధారణలు, కేరళ డ్రమ్స్ వాయిద్యాలతో రథానికి స్వాగతం పలికారు. సాయంత్రం 5.40కు రథం తిరిగి దేవస్థానానికి చేరింది. భక్తులు అరటి పండ్లను స్వామి రథంపైకి వేస్తూ, దర్శించుకున్నారు. దేవస్థానానికి చేరుకున్న రథానికి ఎదుర్కోలు కార్యక్రమంలో భాగంగా మేళతాళాలతో నరసింహస్వామి, లక్ష్మీదేవిని ఆలయంలోకి తీసుకెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో అన్నవరం దేవస్థాన ఈఓ వీర్ల సుబ్బారావు, దేవస్థానం అధికారులు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, కోరుకొండ తహసీల్దార్ సుస్వాగతం, ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్ పాల్గొన్నారు. కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై శ్యామ్‌సుందర్ బందోబస్తు నిర్వహించారు.

రెండో ర్యాంకుకు అన్నవరం దేవస్థానం !

ఇతర పుణ్యక్షేత్రాల స్థానం దిగజారడంతో ఎగబాకిన వైనం



అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరొందిన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం భక్తులకు అందిస్తున్న సేవల్లో రెండో ర్యాంకును సాధించింది. గత నెలలో రాష్ట్రంలోని ఏడు ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో చివరగా ఏడో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 25 మధ్య సేకరించిన అభిప్రాయ సేకరణలో రెండో స్థానంలో ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మిగిలిన దేవస్థానాల భక్తుల అసంతృప్తి శాతం తక్కువగా ఉండడంతో రెండో స్థానంలో నిలిచినట్టు గణాంకాలు చెబుతున్నాయి. గతంలో ఈ దేవస్థానం ఏడో ర్యాంకులో ఉండడంతో కలెక్టర్ షణ్మోహన్ గత నెల 24న అన్నవరం విచ్చేసి, విస్తృత తనిఖీలు నిర్వహించి, దేవస్థానం మొదటి ర్యాంకులో రావాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. భక్తులకు సేవలందించడం, ప్రసాదం నాణ్యత, ఇతర ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్, ఐవీఆర్‌ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరించి తాజా ర్యాంకులు ప్రకటించింది. భక్తులకు దర్శనంలో రెండో ర్యాంకు, మౌలిక వసతుల్లో మూడో ర్యాంకు, ప్రసాదం రుచిలో రెండో ర్యాంకు సాధించింది.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

- నిందితులు మొత్తం 12మంది
- దుబాయ్ నుంచి కీ రోల్ పోషిస్తున్న వినీత్
- నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ వెల్లడి



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్, పక్కన సీఐ, ఎస్సైలు, వెనుక ముసుగులో నిందితులు

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని చక్రద్వారబంధం సమీపంలో ఉన్న బ్రిడ్జి కౌంటీలోని బి–12 విల్లాలో జరుగుతున్న క్రికెట్ బెట్టింగ్‌లో 12 మందిని అరెస్టు చేశామని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ తెలిపారు. దుబాయ్ కేంద్రంగా నడుస్తున్న ఈ క్రికెట్ బెట్టింగ్‌లో పట్టుబడిన వారంతా కర్నాటక, భీమవరం వారేనన్నారు. ఈ వివరాలను సోమవారం సాయంత్రం ఇక్కడ మీడియాకు వెల్లడించారు. భీమవరం మండలం బలుసుముడికి చెందిన దండు వెంకటవర్మ అలియాస్ సంతోష్ (31), కర్నాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు చెందిన ఇమ్మంది భరత్‌కుమార్(34)తో కలిసి బ్రిడ్జి కౌంటీలోని బి–12 విల్లాను అద్దెకు తీసుకున్నాడు. కొంతమందిని ఆఫీసు బుక్కీలుగా, కాంట్రాక్ట్ స్టాఫ్‌గా తీసుకుని కొన్ని నెలలు ఆన్‌లైన్ ద్వారా పంటర్స్(కస్టమర్స్)తో గెలుపు, ఓటములపై గేమింగ్ నడుపుతున్నాడు. ఈ బెట్టింగ్ ప్రక్రియ దుబాయ్ కేంద్రంగా జరుగుతోంది. భీమవరానికి చెందిన వినీత్ అనే వ్యక్తి దుబాయ్‌కి వెళ్లి, అక్కడి నుంచి కన్నడ, ఏపీబుక్.బర్లారి.కామ్‌లనే వెబ్‌సైట్లను నిర్వహిస్తుంటే, ఇద్దరు నిందితులు ఇక్కడి నుంచి అతనికి అడ్మిన్లుగా ఉన్నారు. గతేడాది జూలైలో అడ్మిన్లు ఇద్దరికీ కన్నడ 24.కామ్ అనే వెబ్‌సైట్ ద్వారా వైజాగ్‌లో 20 రోజుల శిక్షణ కూడా ఇచ్చాడు. ఆ తరువాత బి.కామ్ వెబ్ సైట్‌ని కొత్తగా ప్రారంభించి, ఈ బ్రిడ్జి కౌంటీలో అద్దెకు తీసుకున్న విల్లా నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌పై మధ్యాహ్నం 2 గంటల నుంచి మ్యాచ్ పూర్తయ్యే వరకు బెట్టింగ్‌లు నిర్వహించారు. ఈ మేరకు అందిన సమాచారంతో ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ఎస్సై నాగార్జున ఆకస్మిక దాడి చేసి, నిందితులను అరెస్టు చేశారు. మొత్తం 12 మంది నిందితుల్లో ఇద్దరు ప్రధాన నిందితులు కాగా, మిగిలిన 10 మంది బుక్కీలు(ఆఫీస్ స్టాఫ్). వీరి నుంచి ఏడు ల్యాప్‌టాప్‌లు, 42 సెల్‌ఫోన్లు స్వాధీనపర్చుకున్నామని డీఎస్పీ తెలిపారు. బెట్టింగ్‌లకు వినియోగిస్తున్న వెబ్‌సైట్లను క్లోజ్ చేయించడంతో పాటు, వారి బ్యాంక్ ఖాతాలను కూడా సీజ్ చేయించేందుకు చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో సీఐ వీరయ్యగౌడ్, ఎస్సైలు మనోహర్, నాగార్జున, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మూల్యాంకన విధులపై సమావేశం

బాలాజీచెరువు(కాకినాడ): పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనంపై సోమవారం విద్యా శాఖ ఆర్‌జేడీ నాగమణి సమావేశం నిర్వహించారు. స్థానిక రామకృష్ణ పబ్లిక్ స్కూల్లో జోన్–2కు సంబంధించి కాకినాడ, పశ్చిమ గోదావరి జిల్లాల డీఈఓలు, పరీక్షల విభాగ ఏసీ, సీసీలతో సమావేశం జరిగింది. మూల్యాంకన విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సమావేశంలో డీఈవోలు పిల్లి రమేష్, నారాయణ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

నల్లజర్ల: తూర్పుచోడవరంలో నాలుగేళ్ల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన ఇల్లెందుల నాగరాజు(34) అసభ్యంగా ప్రవర్తించాడు. శనివారం ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికను మభ్యపెట్టి, అసభ్యంగా వ్యవహరించాడు. ఈ మేరకు బాలిక తల్లి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని సోమవారం అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్టు ఏఎస్సై శోభనాద్రి తెలిపారు.